డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

క్రొత్త మలుపు

నడినెత్తిమీద సూర్యుడుమండిపోతున్నాడు. ప్రొద్దుట్నుంచి ఏమిలేక నా ఆత్మారాముడు మాడిపోతున్నాడు. ఆ వేడి వాతావరణం దుర్భరం. ఆ బస్‌స్టాండు ఆవరణం అయోమయం.

"సార్ ! రిక్షా కావాలా !" - అంటూ చెమటలు క్రక్కు కొంటూ ఒగరుస్తున్న రిక్షావాడు.

మూటలు దింపుతూ నానాఅవస్థపడుతూ ఆయాసపడుతున్న ఒంటెద్దు బండివాడు.

సత్తువనంతా కూడదీసుకొని పళ్ళు బిగబట్టి లారీలోడ్ చేస్తున్న కూలీవాడు.

స్క్రూ-డ్రైవర్‌లు, స్పానర్‌లు, మంకీ ప్లేయర్‌లు వగైరాలతో నానా హైరాణా పడిపోతూ బస్ రిపేరు చేస్తున్న మెకానిక్కు.

కడపా కోడూరంటూ అరుస్తున్న బ్రోకర్లు.

కబుర్లు చెప్పుకొంటున్న కాలేజీ కుర్రోళ్ళు.

"బూట్ పాలిష్ సార్ !"- అంటున్న కాకీలాగువాళ్లు.

లాఠీకట్టెను త్రిప్పుకొంటూ వస్తున్న ఎఱ్ఱటోపీ వాళ్ళు.

"షిరిడిసిద్ధి సాయిబాబా" - పాట పాడుతున్న కళ్లులేని కబోది.. పడుతూ లేస్తూ.

"అపద మ్రొక్కులవాడా ! ఓ శ్రీనివాసా !" అంటూ వేడు కొంటున్న దిక్కులేని అనాధ, చంకలో చంటిబిడ్డతో.

"సోడా ! సోడా ! చల్లని సోడా ! నిమ్మకాయసోడా కావాలా బాబూ !" - సోడా వ్యాపారం చేస్తున్న పచ్చబనీనోడు.

"ఐస్‌క్రీమ్ ! కప్ ఐస్‌క్రీమ్ ! ఒంటికి చలువ ! పాపా ! తీసు కోమ్మా" - ఐస్ అమ్ముతున్న బట్టతలవాడు.... ....

తల పట్టుకొన్నాను ఉస్సూరు మంటూ 'ఇంటికెళ్ళేదాకా నిలుస్తుందా యీ ప్రాణం' - అనిపించింది.

"పువాం ! పువాం !"-హారన్లు తెగమోగుతున్నాయి.

"డొయ్ ! డొయ్ !"-పొగలు వదుల్తున్నాయిబస్సులు.

సీట్ల కోసం బస్సు కిటికీలనుండే 'కర్చిఫ్' లు విసిరే ముందు జాగ్రత్త ఉన్నవాళ్ళు.

బస్సెక్కే ప్రయత్నంలో ఒకర్నొకరు త్రోసుకొంటూ 'నువ్వా, నేనా' అన్నట్లు కొట్టుకొంటున్న వాళ్ళు.

సందు దొరికితే చాలనుకొంటున్న జేబు వాటమోళ్లు.

టైమ్ వేస్ట్ చేయకుండా త్రోసుకొచ్చే 'అడ' పిచ్చోళ్ళు.

అదరా బాదరా పెట్టె బేడా సర్దుకొంటూ పరిగెత్తుకొస్తున్న పల్లెటూరోళ్ళు.

కదుల్తున్న బస్సులకు వీడ్కోళ్లు చెప్తున్న అతి మర్యాద స్థులు, అభిమానస్థులు, అదో అలవాటుగా ఉండేవాళ్లు.

కొళాయిపంపు దగ్గర 'రాని' నీళ్ళకోసం నిలబడ్డ ఆశాజీవులు.

'పని చెయ్యని' లైట్ మిషన్‌లో పదిపైన లేసి 'రాని' టికెట్ కోసం ఎదురు చూస్తున్న బుర్రమీసాలోళ్లు.... ....

కళ్లు మూసుకొన్నా నొక్క క్షణం

ఎన్ని రకాల మనుషులు !

ఎన్ని విధాల మనస్తత్వాలు !

ఎవర్నీ పట్టించుకోరు. ఎవరి ధోరణి వారిదే. 'నా' అనే ఆలోచనే అందర్లోనూ. 'నీవా' అనే పరామర్శ ఆ తరువాతే.

ఇదే నాకు తెలిసిన 'పిటియబుల్ ట్రాజెడి అఫ్ ది లైఫ్'.

భారతీయ సంస్కృతి ఎంతటిది ! దానికీనాడు ఈగతిపట్టింది.

అమూల్యమైన మన సాంప్రదాయ మెంతటిది ! ఈనాడు అయ్యో పాపమనిపించుకొంటోంది !

ఏదో ముభావం.

ఎందుకో ఆత్మక్షోభ.

లోప మెక్కడిది ?

దోష మెవరిది ?

ఆలోచించే నాధులే లేరా ?

అతిగతీ విచారించే మనుషులే కరువై పోయారా !

నో !

ఈ మనుషుల్లో యింకా మానవత్వం చచ్చిపోలేదు.

ఇంకా ఈ దేశానికా దుర్గతి పట్టలేదు.

కాని....

నేనేమీ చెయ్యలేను.

నాకు తెలుసు, నేను నిమిత్తమాత్రుడినని.

ఇదెంతవరకు నిజం ?

ఆలోచిస్తుంటే.... ....

హోటల్ 'నవదీపక్' లో రికార్డేశారు.

"క్యాహువాఁ ! తేరేవాదా...." రఫీ కమ్మగా పాడుతున్నా ఆ గలభాలో నాకు విసుగ్గా ఉంది.

అంతలో,

ఆర్టీసీ కాంటిన్‌లో మరో రికార్డు—

"భలే భలే మొగాడివోయ్ ! బంగారు నా సామివోయ్ !- ఎల్లారీశ్వరి "అబ్బా" అనిపిస్తోంది.

నా బస్ రావడానికి యింకా పదిహేను నిమిషాల పైముంది.

"అంతవరకు ఈ గోలను భరించాల్సిందేనా !"—బాధేసింది.

"గత్యంతరం లేదు సుమా !"-అన్నట్లు చూస్తోంది నా సూట్‌కేసు.

పది సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నాను ఈ బస్‌స్టాండులో వచ్చిన మార్పును.

సంతోషించాను. కాని పదిసంవత్సరాలుగా నేకోరుకొంటున్నది ఈ మార్పు రావాలనా ? కాదు.

పోనీ నా కోరిక ఏనాటికైనా తీరుతుందా ! ఏమో !— ఆలోచించసాగాను.

కేవలం బస్‌స్టాప్ ఒకటే మొదట్లో. అదీ యం. ఎల్యే రంగస్వామిగారి చలవ వల్ల. కాని ఇప్పుడది బ్రహ్మాండమైన బస్‌స్టేషన్‌గా తయారైంది. రంగస్వామి గారు స్టేట్ మినిష్టరయ్యారు.

చిన్న ఉడిపి హోటలుండేది అప్పట్లో, నారాయణయ్యర్ గారి జీవనాధారమై కాని ఇప్పుడది టూ స్టార్ హోటలై జిగేలుమంటోంది. హోటలయ్యరిప్పుడు బాగా పరపతి గడించాడు.

వారేకాదు,

ఎందరో వ్యాపారస్థులు బాగా డబ్బు సంపాదించారు. మిద్దెలు మేడలు కట్టుకొన్నారు.

జీవితంలో స్థిమిత పడ్డారు. కాని,

ఆనాటి నుండి ఈనాటి వరకు నేను చూస్తున్న—

రిక్షావాడు, ఒంటెద్దు బండివాడు, కూలీవాడు, మెకానిక్కు- ఎవరూ మారలేదు.

అప్పుడున్న కళ కూడ వారికి లేదిప్పుడు.

అలాగే,

అరుస్తున్న బోరికుర్రు అరుస్తూనే ఉన్నారు. కబుర్లు చెప్పుకొంటున్న కాలేజీ కుర్రోళ్ళు కబుర్లు చెప్పుకొంటూనే ఉన్నారు, ఒకప్పుడెంతో ఉత్సాహంగా. ఇప్పుడుమాత్రం ఎంతోనిరుత్సాహంగా.

బూట్ పాలిష్ కాకీలాగు వాళ్ళు, లారీ కట్టెల ఎత్తిటోపీ వాళ్ల అలాగే ఉన్నారు. కళ్ళులేనివాడు, దిక్కులేని అనాథ, సోడా వాడు, ఐస్‌వాడు ఏమాత్రం మార్పు లేకుండా అలాగే ఉన్నారు. ఇంకా మునపటి కన్నా హీనంగా, దైన్యంగా దరిద్రాన్ని అనుభవిస్తూ, దౌర్భాగ్యాన్ని తూలనాడుతూ—

ఏదో బ్రతుకుతున్నారు.

ఎందుకో బ్రతుకుతున్నారు.

ఇవి వీరితోనే అంతమౌతాయా ?

ఇంతటితో ఈ కథలు ముగిసిపోతాయా ?

ఎలా బ్రతికినా, ఎందుకు బ్రతికినా బ్రతుకుతున్నారు కాబట్టి....

తరతరాల పర్యంతం ఆ బ్రతుకు లలాగే గడుస్తుంటాయి.

భూమికి ఎంత భారంగానో !

ఆకాశాన్ని దాటి పోతో !

అలా అని ....

వీరికి బ్రతుకు నివ్వక పోవడమా ?

కాదూ కూడదని ....

ఇలాగే బ్రతకండనడమా ?

ఒక్కసారి .... ఆత్మపరీక్ష చేసుకొంటే

మరోసారి .... స్వయం విమర్శ చేసుకొంటే

కర్తవ్యమేదో తప్పక బోధ పడుతుంది!

విద్యుక్తధర్మమేదో తెలిసొస్తుంది!

వీరి జీవితాలను ఉద్ధరించే వారే లేరా!

వీరిలో ఆశాదీపాలను వెలిగించే వారే లేరా?

వీరి ఆర్థిక స్థితిని బాగుపరచి సాంఘిక ప్రమాణాన్ని పెంచే వారే లేరా?

వీరిలో అక్షర జ్ఞానాన్ని కలిగించి అభ్యుదయ రాగాన్ని పలికించే వారే లేరా?

వీరి మానసిక వ్యధను తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని కలిగించే వారే లేరా?

వీరి కష్టసుఖాలను విచారించి సముదాయించే వారే లేరా?

గుండెనిండా ఆవేదన పొంగి పొర్లుతోంది.

కళ్లనిండా నీళ్లు ముంచుకొచ్చాయి.

కాని,

ఏమి చేయలేని నా అశక్తతను తలచుకొని, ఎందుకూ కొఱగాని నన్నీసడించుకొని నిట్టూర్చాను.

నిస్పృహతో, నిరాశతో నా ఒక్కడి వల్లా ఏమీ కాదనే అసంతృప్తితో, ఆర్తితో.

ఐనా నా కనిపించింది —

"పదిమందనుకొంటే సాధించలేనిదేమీ లేదని, నేనొక్కడి నేనని అనుకోక అందరిని సమాయత్త పరచాలి. వారికి బాగోగులను వివరించాలి. వారిలో సామాజిక స్పృహను కలిగించాలి. వారిలో నిద్రాణమై ఉన్న మానవత్వాన్ని జాగృత పరచాలి. అందరూ నడుంకట్టి ఐకమత్యంతో, క్రమశిక్షణతో మెలిగినప్పుడు సంస్కార భవిత సాక్షాత్కరించక పోతుందా? సర్వ సమానత అవతరించక పోతుందా?

అని

ఆలోచిస్తున్న నేను నా బస్సు రావడంతో సూట్‌కేసును చేతిలోకి తీసుకొన్నాను. ఆ బస్సు కాస్సేపు వెనక్కూ ముందుకూ కదలి నిశ్శబ్దంగా నిలచింది. నేను నా రిజర్వ్‌డ్ సీట్ మీద సూట్‌కేసుంచగలిగాను అతికష్టం మీద. కంటిన్యువస్‌గా సిక్సవర్స్ జర్నీ చేయాలనుకోవడంతోనే నీరసమొచ్చినట్లైంది. కాని విధిలేదు. యూరిన్ పాస్ చేసొద్దామని లావెటరీ కోసం చుట్టూ చూసాను. బస్‌స్టాండ్లలో పబ్లిక్ పాయిఖానాల్లోకి వెళ్లాలంటేనే జుగుప్స. మన "ఆరోగ్యశాఖ" వాళ్ళు అంతంత మాత్రమే పని చేస్తుంటారు. సానిటేషన్ పరమ ఘోరంగా ఉంటుంది. నడిరోడ్డు మీదికి పరుగులు తీసే మురికి కాలువల్ని దాదాపు ప్రతి ఊర్లో మనం చూస్తూనే ఉంటాము. ఇక బాగా రద్దీవున్న ప్రాంతాలైతే....సరేసరి కృష్ణా పుష్కరాలు గుర్తుకొస్తాయి – అందుకే అందులోనికి వెళ్ళడానికి సాహసించలేదు.

బస్సు కదలడానికింకా అరగంటుంది కదా అని కాస్త ముందు వైపుకు నడిచాను, క్రొత్తగా మున్సిపాల్టీవాళ్ళు కట్టిన 'యూరినల్స్' నోసారి దర్శిద్దామని. క్రొత్తగా రిలీజైన తెలుగు సినిమా కోసం సూపర్ స్టార్ కటవుట్‌ను బ్రహ్మాండంగా అలంకరిస్తున్నారా సెంటర్లో. ఆ హీరో బొమ్మకు ఆరడుగుల పూలహారం వెయ్యబోయి ఒకడు దభాలున క్రిందపడ్డాడు. ఐదారడుగుల ఎత్తు నుండి క్రింద పడ్డాడంటే ...నేనాత్రంగా చూచాను. 'జేజమ్మ' కనబడినా మళ్ళీ మామూలుగా లేచి పూలదండ కంటిన మట్టిని దులిపి సరిచేస్తుంటే, "ఆహా! హీరో జిందాబాద్! నీ బ్రతుకే పండుకన్నదయ్యా! నీ కోసం తమ ప్రాణాల్ని సైతం యివ్వగలిగే ఈ తెలుగు అభిమానుల ఆశీస్సులు, అండదండలు నీకుండగా సిక్టీస్ దాత్తేనేం నీ ఎవర్‌గ్రీన్ హీరో కాకుండా ఉండగలవా!"

అనుకొన్నాను.

"ఏంటో! వీరి పిచ్చికాని అభిమానమనేది అటహాసంలో ఉంటుందా? హృదయంలో ఉండాలి కాని. నాకు తెలిసి వీరు చేసే నానా హంగామా, సినిమా రిలీజైన మొదట్రోజు చేసే అల్లరి అంతా వీరి పేరు కోసమా? తమ హీరో ప్రతిష్ఠ కోసమా? వీరికి ఆ హీరోల సహాయం కూడా ఉంటుందని వినికిడి. ఋజువులు కూడా ఉన్నాయ్. ప్చ్. ఎవర్ని నిందించి ఏం లాభం! మానసికంగా మనుషులెదగాలి కాని, మంచి చెడులు తెలుసు కోవాలి కాని.

నా బస్ హారన్ వెయ్యడంతో నా నడక జోరును సడన్‌గా పెంచేసాను.

మెన్స్ క్లోజెట్ లోకి ప్రవేశించబోయి, ఒక్కక్షణం తటపటా యించాను.

ద్వారానికడ్డంగా బాగామాసిపోయిన కర్టన్ తగిలించబడిఉంది.

ఆ కర్టన్‌ను తొలగించి లోపలి కడుగెయ్యబోయాను.

ఆశ్చర్యం!

తెప్పరిల్లుకోలేక పోయాను.

అసలు నా కళ్ళకేం కాలేదుకదా అని అనుమానపడ్డాను.

అక్కడ —

ఎన్నాళ్లగానో తిష్ఠవేసినట్లనిపించే లంబాడీల జంటలు రెండున్నాయి.

వారక్కడే కాపురం చేస్తున్నారనడానికి నిదర్శనంగా నాలుగైదు సిల్వర్ బోకులు, ఒక కుక్కి నులక మంచం, చింపిరి గుడ్డల మూటొకటి, చిల్లుపడి త్రుప్పుపట్టిన డబ్బారేకులపెట్టె, వారుఅమ్ముకొనే నానారకాల పూసలు, బుట్టలు, తట్టలు, విసన కఱ్ఱలు వగైరా .... వగైరా.

వారు నా వైపదోలా బెరుగ్గా చూచారు. ఆ చూపుల్లో వారి భయం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకడు చేతులెత్తి మ్రొక్కేడు. ఆ మ్రొక్కులో వారి అసహాయత ఆర్తనాదం చేస్తోంది.

గిరుక్కున వెనక్కుతిరిగాను.

గబగబా బస్సు దగ్గరకు నడవసాగాను.

"ఎంత దారుణం! ఎంత అవమానం! నిలవడానికి నీడలేక' చివరికి మరుగుదొడ్లలో .... మురికి కూపాల్లో నివసించడమా! వారూ మనుష్యులేనే! చీమూనెత్తురూ ఉన్న వారేనే! వారెలా ఉండగలిగారు? ఏముంది! ఇక వేరేదిక్కు లేదు. వారిని ఆదరించే వారు లేరు. అయ్యోపాపమనే వారే లేరు.

అందుకే,

జంతువులకన్నా హీనమై పోయారు. అభిమానాన్ని గతిలేక వదలుకొన్నారు. వారిని దూషించ వలసిన అవసరం లేదు. వారికా స్థితి కలిగించిన మన నైజాన్ని బాగుపరచు కోవాలి.

వారిలోని పిరికితనాన్ని, చేతకాని తనాన్ని ఆసరాగా తీసుకొని మనమెంతకు దిగజారిపోయాము. వారి మంచితనాన్ని, బేలతనాన్ని ఊతగా తీసుకొని మనమెంతకు తెగించాము.

వారెదురు తిరిగితే....
సముద్రాలై ఘోషిస్తే....
అగ్నిపర్వతాలై బద్దలైతే ...
ప్రళయకాల రుద్రులై కక్షగడితే....
అప్పుడు,
ఇంకేమన్నా ఉందా?
మనుగడ విలువలు మట్టిపాలు కావా?
మమతానురాగాలు మసిబారిపోవా?
మనిషికీ మనిషికీ మధ్యన అగాధా లేర్పడవా?
మానవత్వపు పునాదులు కూలిపోవా?
అందుకే,

ఆ స్థితి రాకముందే కళ్ళు తెరవాలి. పరిస్థితి చెయ్యి దాటక ముందే మేలుకోవాలి. జాత్యాభిమానాలు, ప్రాంతీయ భేదాలు, భాషా వివాదాలు, వర్గ వివాదాలు మాని మహాత్ముడు కలలుగన్న సర్వమానవతా పరిపాలనా యంత్రాంగాన్ని సృషించాలి. ప్రజల హక్కులను పరిరక్షించాలి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఊపిరి పోయాలి. మనసులోని మాటను యథాతథంగా బయట పెట్ట గలిగే స్థోమతను కలిగించాలి. అన్యాయాన్ని, అక్రమాన్ని అరి కట్టగలిగే గుండె బలాన్ని కలిగించాలి. ప్రతి మనిషినీ గుర్తించి, ప్రతి మాటకూ విలువ నిచ్చి, సదవగాహనతో, సౌశీల్యప్రవృత్తితో ప్రతివాడూ ముందడుగు వేస్తే భారతీయ సంస్కృతి అత్యున్నత శిఖరాగ్రాలపై శాంతి బావుటా నెగరవేస్తుంది. వాని ప్రగతి హృదయం విచక్షణతో, విజ్ఞతతో గీతా సూక్తుల నాలాపిస్తుంది. నిజంగా ఆలోచిస్తే ఎంత హాయనిపించింది నాకు. నిండుగా శ్వాస పీల్చుకొన్నాను.

గమ్యం చేరాలని బస్సు కదిలింది. ముందు కెళ్ళసాగింది. వేగాన్ని పుంజుకొంటోంది. మలుపు తిరుగుతున్నప్పుడు నేను కిటికీలోనుండి ఆ పరిసరాలను మరొక్కసారి చూచాను. చెంప ఛెళ్ళుమనిపించినట్లు ఫీలయ్యాను.

గుండెనేదో కెలికినట్లు మూలిగాను.

నాకు నమస్కరించిన లంబాడీ వాడు పోలీసు వానికేదో ముట్టజెప్పు తున్నాడు. ఏ మాత్రం సందేహించ కుండా దాన్నందు కొని ముందుకెళ్లతున్నాడా కానిస్టేబుల్. సుళ్లు తిరిగే రక్త ప్రవాహంలో నా అనుభూతి కొట్టుకొంటోంది. పీల్చి పిప్పిచేస్తున్న కబంధ స్మృతులలో ఏదో ఆర్తగీతి వినిపిస్తోంది. లంబాడీపై సానుభూతి చూపే ఆ అనుభూతి, ఆ పోలీసువాణ్ణి చూచి అసహ్యించుకొనే ఈ ఆర్తగీతి, రెండూ కలసి నాకేదో అర్థంకాని, నా ఊహకందని సందిగ్ధంలో ముంచేశాయి.

నాలో ఏదో ఆలోచన!

ఎందుకో ఆవేశం!

ముందు వీరిలో ఉన్న భయాన్ని తొలగించాలి. దాన్ని తొలగించాలంటే వారిలో అలుముకొన్న నిరాశా చీకట్లను తొలగించాలి. దాన్ని తొలగించాలంటే వారిలో అక్షరజ్ఞానాన్ని, యింగిత జ్ఞానాన్ని కలిగించాలి. వారికి మంచి, చెడూ విడమర్చి చెప్పాలి. వారిని అభివృద్ధి పరచేందుకు అన్ని రంగాలలోనూ అవకాశమివ్వాలి. వారిని నిరుత్సాహ పరచక వారిలో నూతనోత్తేజాన్ని కలిగించాలి. వీరికొరకెందరో ముందుకు రావాలి. ఏదో ఆలోచిస్తున్న నన్ను నా మనస్సాక్షి సూటిగా ప్రశ్నించింది.

"ఎందరో రావాలంటున్నావే! నీవే మొదటి వాడివి ఎందుక్కాకూడదు" —

"ఔను నేనే ఎందుక్కాకూడదు" —

నాలో సంఘర్షణ క్రొత్తమలుపుకు దారితీసింది.

సరిగ్గా అప్పుడే,

నేను ప్రయాణం చేస్తున్న బస్సు తూర్పువైపుకు తిరిగింది.